● ఈవారం కథ

# గమనశ్రమరాగం

—ఎ. వి. రెడ్డిశాస్త్రి

## శనివారం ఉదయం

ఇంకా చీకట్లు ఆ మూలనీ యీ మూలనీ దోబూచులాడుతూనే వున్నాయి. అయితే ఆంజనేయ స్వామివారి కోవెల ప్రాంగణంలో మాత్రం మైకుల హోరు అప్పుడే ఆరంభమయిపోయింది.

హనుమాన్ చాలీసా మొత్తం యూనివర్సిటీ కేంపస్ అంతటికీ వినిపిస్తోంది. పది పదిహేనేళ్ళ క్రిందట స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన పూజారి బిక్కమొహం వేసుక్కూర్చునే వాడు—



ఎవరేనా భక్తులు వొస్తారా అని ఎదురుచూస్తూ. ఆనాడు అస్తిత్వం కోసం తంటాలుపడిన ఆంజనేయు డికి, ఇవాళ బోలెడు గుర్తింపు.

కాంక్రీటు స్తంభాలతో నిర్మించిన ఆలయ మండపం, పూజారికో యిల్లు–చిన్నదే అవు గాక–ఇవన్నీ పెరుగుతున్న పరపతికి సంకే తాలు. దేవుడి విగ్రహం ప్రతిష్ఠించటం కూడా చాలా ముందుచూపుతో చెయ్యవలసిందే–ఎం చేతనంటే అదికూడా యీ రోజుల్లో లాభసా టైన వ్యాపారం కాబట్టి. 'మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి?' అని విగ్రహాన్ని నిలవదీసే స్థితి రాకుండా వుండాలంటే, అను వుగా వున్న జాగా చూసి దేవుణ్ణి ప్రతిష్ఠించాలి. ఇదే చూడ్రాదూ, ఈ కేంపస్‌లోవున్న హనుమం తులవారికి బోలెడు 'పేట్రనేజ్' లభిస్తోంది విద్యార్థులనుంచి. విద్యార్థుల్ని యీ రోజుల్లో చాలా చాలా సమస్యలు, కోరికలు వేధిస్తు న్నాయి. థేంక్‌గాడ్, పూర్వకాలంలో విద్యార్థుల్ని చంపుకుతింటుండే పరీక్షల బెంగ యీ కాలం విద్యార్థులకి బొత్తిగా లేకుండా పోయింది, మాస్ కాపీయింగుల ధర్మమాఅని. మావూరి సెంటర్లో కాపీయింగు వుండదని ఏ కాలేజి ప్రిన్సిపాలేనా బడాయి చెప్పుకుంటే, వినేవాళ్లంతా పడీ పడీమని నవ్వుతారు, గొప్ప జోక్ వేశావని. ఏతావాతా, ఈ కాలం విద్యార్థుల సమస్యల స్వరూపమే వేరు–ప్రేమ గొడవలు, సీసాల గొడ వలు, సినిమాల గొడవలు, మెస్‌లో బాగా మంచి భోజనం దొరకాలనే గొడవలు, యూని యన్లు, ఎన్నికలు, డౌన్‌డౌన్‌లు, బోయ్‌కాట్లు–ఇవన్నీ వారిని నిత్యం కాల్చుకు తింటున్న కొన్ని సమస్యలు. ఈ సమస్యల్నుండి బయటపడేట్టు చెయ్యమని కాబోలు–చాలా మంది విద్యార్థులు అంతమందీ కాదు– ఆంజనేయుడి భక్తులుగా మారేరు. ఈ తరహాకి చెందిన భక్తులంతా శని వారం వుదయాన్నే లేచి తలల్ని షేంపూ చేసి, గుడికొచ్చి భక్తిగా దేవుడికి మొక్కి పూజారిచ్చిన పువ్వో, పత్రో చెవి వెనక ధరించి తిరిగి వస్తుంటే మనమంతా భయపడి చస్తుండే విద్యార్థులు వీళ్ళేనా అని ముక్కున వేలు వేసుకుంటాం.

ఆ మూలనుండీ, ఈ మూలనుండీ ముక్కుతూ, మూలుగుతూ గుడి దగ్గరికి చేరు కుంటున్నారు బిచ్చగాళ్ళు–శనివారంనాడు యీ గుడి దగ్గర బోలెడు హడావిడి వుంటుంది కనుక నాలుగు పైసలు దొరుకుతాయని వాళ్ళాశ. ఈ బిచ్చగాళ్ళనీ, విద్యార్థి భక్తుల్నీ గమనిస్తూ నా మోర్నింగ్ వాక్ సాగిస్తున్నాను–చలి బాధ తెలీకుండా వులెన్ ట్రౌజర్, టక్ చేసిన షర్ట్, స్వెట్టర్, ఏక్షన్ షూస్. నాతోపా టుగా మోర్నింగ్ వాక్‌కి బయలుదేరే మిత్రులు కూడా ఆ జంక్షన్ దగ్గరా, ఈ జంక్షన్ దగ్గరా తారసపడి 'హల్లో! హల్లో' అంటూ ప్రొసెషన్‌లో కలిసిపోయి, యాత్ర సాగిస్తున్నారు. వెచ్చని దుస్తుల్లో నడక సాగిస్తున్న మేమంతా, అలంక రించబడిన బుట్టబొమ్మల్లా కనిపిస్తుంటే అదిగో అడుక్కోడానికి వెళుతున్న బిచ్చగాళ్ళు పేలికల్లో చలికి వణికిపోతూ, దిష్టిబొమ్మల్లా కనిపి స్తున్నారు. సంపాదన అనే అవిశ్రాంత పోరా టంలో పడిపోయి మేమంతా శరీరాల్ని అదుపు చెయ్యడం మానేశాం. దాంతో రావిశాస్త్రిగారు చెప్పినట్టు మా శరీరాల్లో విటమిన్లు, ప్రొటీన్లు, కొవ్వులు మొదలైనవి పెరగకూడనంత స్థాయికి పెరిగి రక్తపు పోట్లు, గుండెపోట్లు, వాత పట్లు లాంటి వ్యాధుల్ని తెచ్చిపెట్టేయి. ఇప్పుడు మా ఏకసూత్ర పథకం ఒకటే, మా శరీరాల్ని అదుపులోకి తెచ్చేసుకోవాలి. దానికోసమే మేం పడుతున్న అవస్థలన్నీ–మోర్నింగ్ వాక్‌లు, జాగిం గ్‌లూ, జంపింగులు, రన్నింగులు, స్కిప్పింగులు యిత్యాదులు. అయితే ఏసీగదిలో ముసు గుతన్నిసి వెచ్చగా తొంగోకుండా, ఎందుకొచ్చిన దిక్కుమాలిన చావురాయిది'అని మేము విసు క్కోని రోజుండదు. బయటకి మాత్రం యీ గెంతుల్ని, నడకల్ని మహా ఎంజాయ్ చేస్తున్నట్టు నవ్వు ముఖాల్ని డిస్‌ప్లే చేస్తుంటాం. ప్రతి వాడి ముఖమూ ఓ మాస్కే.

మా గమ్యం ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ బిల్డింగ్. ప్రజల్నుండి దూరంగా పారిపోయి ఎక్కడో కోటలు కట్టుకొని నివసించిన పూర్వ కాలం రాజులు గుర్తుకు వస్తారు. యీ లైబ్రరీ భవంతిని చూస్తుంటే అందరికీ అందుబా టులో వుండవలసిన అగత్యం నాకు లేదన్నట్టు దూరంగా వెళ్ళి ఓ ఎత్తయిన గుట్టమీదకి ఎక్కి కూర్చుంది. మా గమ్యంగా యీ బిల్డింగుని ఎన్నుకున్నది కూడా యీ కారణం చేతనే. "దెప్పెక్కినట్టు, దేవుడికి మొక్కినట్టు" అని శ్రీకాకుళం జిల్లాలో ముతక సామెత ఒక టుంది. కష్టపడి యీ లైబ్రరీ గుట్టని ఎక్కితే, మరికొన్ని అదనపు కేజీల బరువుని వదిలిం చుకోవచ్చునని మా తాపత్రయం. పనిలోపని,

# సి.నా.రె. ఛలోక్తులు



ఆంధ్రదేశంలో సురభి నాటక సమాజానికి వందేళ్ల గొప్ప చరిత్ర వుంది. పల్లెల్లో ప్రదర్శించే వారి నాటకాలు ఈనాడు టౌన్లకూ పట్టణాలకూ పరిమితమవుతున్నాయి. టెంట్లు వేసి ప్రదర్శించే సురభి వారిని ఈ మధ్య రవీంద్ర భారతి, గాన సభల ఏర్‌కండీషన్డ్ ఆడి టోరియంలకు పిలిపించి ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. అలాంటి ఒక సందర్భంలో సురభి వారు తమకు తాముగా హైదరాబాదులోని ఓ ప్లే గ్రౌండులో నాటకాల్ని ప్రదర్శిస్తున్నారు. (22–6–'91); వాటికి సినారెని ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచారు.




ఆ సందర్భంగా ప్రసిద్ధ కథా రచయిత జి. రామకృష్ణారావుగారు డి. నారాయణరెడ్డి గారితో "సురభి వారు 90 ఏళ్ల తర్వాత హైదరాబా దులో తాముగా నాటకాల్ని ప్రదర్శిస్తున్నారు. అదీ విశేషం!" అన్నారు.

"అదేంటి? అప్పుడప్పుడు రవీంద్రభారతిలో వేసే వారు గదా" అని సినారె ప్రశ్నించారు.

"ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రదర్శిస్తున్నారండీ" అన్నారు జి.రా.

"టెంట్ వేసినా కంటెంట్ సురభే గదా!" అని సినారె చమత్కరిం చారు. చుట్టూ వున్న మేమందరం గొల్లున నవ్వాం.

– జయధీర్ తిరుమలరావు
హైదరాబాద్

◆ సేకరణ: డాక్టర్ ఎన్.గోపి ◆

పక్కనే వున్న గుడిలోకి జొరబడి ఆంజనేయుల వారిక్కూడా ఓ సెల్యూట్ కొట్టేస్తాం.

పోతే ఇవాళో చిన్న గమ్మత్తయిన ఆలోచన వచ్చింది, గుడి దగ్గరకి చేరుకుంటున్న బిచ్చగాళ్ళని చూస్తుంటే, ఈ బక్క వెధవలంతా పైసా, పైసా ముష్టికోసం రోజల్లా ఎండలో ఎలా కూర్చుంటారు చెప్మా అనే సందేహం వచ్చింది నాకు. కాస్త దూరం నడిచేనో లేదో అప్పుడే చమటలు పట్టేసి ఆయాసపడి పోతున్నాను. నాతో శ్రమిస్తున్న ఇతర మిత్రుల పరిస్థితీ యిదేవిధంగా వుంది. గుట్టని ఎక్కుతున్న మాకు అడుగు తీసి అడుగు వెయ్యడమే బహు ప్రయాసగా వుంది.

ఇంతలో మాకెదురుగా వస్తున్న ఓ బిచ్చగాడు కంటబడ్డాడు. వాణ్ని చూస్తుంటే ఎన్నో యుగాల నుంచీ అడుక్కుంటూ, అడుక్కుంటూ అలిసిపోయిన వాడిలా కనిపించేడు. చివిగిన పేలికలు, మాసిన గెడ్డం, కళ్ళల్లో కొనప్రాణం, వెన్నే తప్ప కడుపన్నమాటే లేనట్లు కనిపిస్తున్న గడకర్ర ఆకారం, వూతకర్ర, సిలవరి బొచ్చెలతో వాడు కనిపించగానే సహజంగా నాలాటి వాడికి రావలసిన చికాకు రాలేదు. చెప్పొద్దూ, ఎందుకో నాకు కాస్త సిగ్గనిపించింది నా బట్టలూ, ఆకారాన్ని చూస్కోగానే. "వాడ్నీవిధంగా బక్కచిక్కి బతకమన్న సమాజమేనా, నన్నీవిధంగా పోతరించి బతకమంటున్నది" అని ఓ వైరాగ్యపు ఆలోచన లేచింది మనసులో. మేం గుట్ట ఎక్కడానికి పడుతున్న శ్రమ వాడు గుట్ట దిగడానికి పడుతున్న శ్రమ ముందర ఏపాటి అనిపించింది. మాతోపాటు నడుస్తున్న ఖాదర్ చెప్పుకొచ్చేడు వాడి కథ. ఆయన లైబ్రరీలో పని చేస్తున్నాడు. బిచ్చగాడిది రాంనగర్ ఏరియాట. అడుక్కోడానికి పొద్దున్నే చలిలో నడిచి రాలేక, రాత్రే యిక్కడికి చేరుకున్నాట్ట. వాణ్నిచూస్తే జాలేసిందట. పొద్దుపోయి యింటికి వెళుతున్న ఖాదర్‌కి చల్లో పడుకుంటే చచ్చిపోతాడేమోననిపించి, రాత్రికి లైబ్రరీ ముందు వరండాలో పడుకోనిచ్చేట్ట.

తిన్న తిండి అరగడమెలాగని మేం బాధపడి చస్తుంటే తిండానికి యీ శనివారమేనా గుప్పెడు గింజలకి సరిపడా ముష్టి దొరుకుతుందా అనే బెంగ వాడిది. లక్షలకొద్దీ ఆస్తులు మూలుగుతున్నాయి కనక కాలక్షేపానికి వుండుండి వైరాగ్యపు ఆలోచనల్లో విహరిస్తుంటానని యింతకు ముందే చెప్పానుగదా! అంచేత యీ బిచ్చగాణ్ని చూడగానే మళ్ళీ మరోసారి కలిగిన ఆలోచనేవిటంటే వూహించడానికి కూడా హాస్యాస్పదంగా కనిపించేంత ఆర్థిక వ్యత్యాసాలతో తులతూగుతున్న మన యీ సమాజంకంటె, అటవిక సమాజం వేరొకటి ఎక్కడేనా వుంటుందా అని. ఇంతలోనే ఆలోచన్లకి గండి—మిత్రుల జోక్స్. వేదాంతం, తత్వ చింతన గాలికెగిరిపోయాయి. "గమనశ్రమ రాగాన్ని విన్నారా?" మిత్రుడు ఆచారి ప్రశ్న. ఆయనకి సంగీతంలో కించిత్తు ప్రవేశం వుంది—అదీ బడాయి.

వినిపిస్తోంది కదా గమనశ్రమ రాగం! గుట్ట ఎక్కలేక, ఆయాసపడ్తూ మేం విడుస్తున్న నిట్టూర్పుల రాగం ఓ పక్క, పస్తుల్తో నీరసంతో, వృద్ధాప్యంతో, నిస్పృహతో వేస్తున్న ప్రతి అడుగు ఒక శాపం కాగా—బిచ్చగాడు మూలుగుతున్న మూలుగులు వేరోపక్క. గమనశ్రమని మేమూ వాడూ కూడా అనుభవిస్తున్నాం. కానయితే కారణాలు మాత్రం వేరు. పాయసంలో పంచదార ఎక్కువయిపోయిందని మా ఏడుపయితే గంజిలోకి వుప్పుగడ్డేనా లేదని వాడి గోడు.


